## వేదుల చిన్న వేంకట చయనులు - నవ్య వీక్లి కథల పోటీలో

# విశేష బహుమతి రూ. 2,000 పొందిన కథ

**అద్దం ముందు నిల్చున్నాది ముఖం చూసుకోవడానికి.**
**ఆశ్చర్యం... తన ముఖం కనబడ్డం లేదు అద్దంలో ...?**
**ఎవరిదో ముఖం. అసలు వీణ ముఖంతో పోలికే లేదు.**
**ఎవరి ముఖం ఇది ...?**
**ఆమె వెనక ఎవరో నిల్చున్నారా లేక ముందే నిల్చున్నారా?**
**కుడివైపో... ఎడమవైపో ... ఎక్కడి నుంచో ఓ కొత్త ముఖం వచ్చి అద్దంలో కనబడుతోంది.**
**వెనక్కి రెండడుగులు వేసి ఇటూ అటూ చూసింది. . . ఎవరూ కనబడలేదు.**

ఎవరూ లేరు. అవును.. ఎవరూ లేరు.

అపార్ట్‌మెంట్ తలుపులన్నీ వేసి వున్నాయి. రాత్రి పడుకునే ముందు ఆమె ఒక్కర్తే వుంది. లేచేక తలుపులు తియ్యలేదు.

# అద్దంలో ముఖాలు!!

## జంధ్యాల మాలతి

వీణ లేచేక పని మనిషి, ధోబీ, పక్కింట్లో ఆంటీ ఎవరూ రాలేదు.

కనీసం తలుపు కూడా తట్టలేదు.

మరి ఎలా .... ఈ కొత్త ముఖం అద్దంలో..?

ఎవరో ఇంట్లో దూరి తనను భయపెట్టటం...

అసలు కనబడుతున్న ముఖం యొక్క శాల్తీ మనిషేనా...

లేక ఎవరిదో ప్రేతాత్మ...

ఝల్లు మంది!!

మళ్లీ పడుకోవటమే బెటర్.

మనసులోని భయాలతో.... ఆ భయాలు ముద్దగా తయారై అవే ప్రేతాత్మగా రూపుదిద్దుకు న్నాయి.

మళ్లీ బెడ్ మీదికి చేరింది వీణ.

ఎ.సి. ఆన్ చేసి బ్లాంకెట్ కప్పుకుంది.

మెల్లిగా నిద్రలోకి...

ఎంత అందమయిన ముఖం తనది!

అప్పుడే స్నానం చేసి అద్దం ముందు నిల్చుంటే...

ముఖం మీది సన్న సన్నటి నీటి బిందువుల గుండా తన ముఖ కాంతులు దూరి అవి తిరిగి రిఫ్లెక్ట్ అవుతుంటే. . .

అద్దంలోకి చూస్తున్న కళ్లు చప్పుచప్పున సలిలం లోని మీనాల్లా కదుల్తూ.. వదన సౌందర్యాన్ని తమకు తామే వీక్షిస్తూ, అందాన్ని అస్వాదిస్తూ, ముఖదీప్తులను ద్విగుణీకృతం చేస్తూ..

విల్లులాంటి కనుబొమలు ఆ మీనాలకి పైగా నిలిచి వాటి సౌందర్యాన్ని రక్షించేదీ, చాటేదీ తామే అని గాంభీర్యాన్ని ప్రదర్శిస్తుంటే. . .

తన వదన సౌందర్య తరళ దీప్తులకు తనకు తానే పరవశిస్తూ, సిగ్గిలిపోతూ వుంటే చెక్కిళ్లు గులాబీ రంగును పులుముకుంటే. . . .

వీణ తన సౌందర్యానికి తనే అచ్చెరువొం దుతూ... ఎంత అందం తన ముఖం!

కలలో కనిపించిన వీణ ముఖం ఎప్పటిదో ....?

ఆ ముఖం జ్ఞాపకాల పొరల్లో ఆమెకు దర్శనమీ యగానే మళ్లీ తెలివొచ్చేసింది. అది ఆమె ముఖం. . . కాని ఇప్పటిది కాదే. ఎప్పుడో ఇంకా టీనేజ్ దాట నిది!

మంచం పక్క అలారం టైం పీస్ ట్రింగ్ మంది.

ఆపి టైం చూసింది.

పొద్దున్న 9 గంటలయింది.

తొమ్మిది గంటలకి అలారమేమిటి. . . లేకుంటే లేవలేదు.

లేట్ నైట్స్ . . రాత్రి రెండు దాటేక పడుకో వటం.

ఒక్కోప్పుడు తెల్లవారి నాలుగవుతుంది.

ఈ మధ్య మ్యూజిక్ వర్ల్డ్ దగ్గర పుస్తకాలు చూస్తుంటే కొత్త 'అవుట్ లుక్' అట్టమీద 'ద టూ ఎ ఎమ్ పీపుల్' ఆర్టికల్ చూడగానే ఆమెలో కోపం ముంచెత్తింది.

'బ్లడీ రైటింగ్స్' అని పైకే కామెంట్స్ చేసింది.

ఆమె కూడా ఆ లోకానికే చెందుతుంది!

గబుక్కున మంచం మీంచి గెంతి బాత్రూ మ్‌లో దూరి పది నిముషాల్లో బయటపడింది తడి వంటి మీద టవల్తో.

కిచెన్లోకి. . . కిచెన్ విండో క్లోజ్ చెయ్యలేదు రాత్రి.

షిట్ . . . ఒక్క థడ్‌తో ఠపీమని క్లోజ్ చేసింది.

కాఫీ . . . కల్ కా రోటీ గరమ్ కర్‌దూం. . . ?

కాఫీ వేడెక్కి ఆమె లిప్స్‌ని చేరింది.

కాఫీ గుటుక్కమనిపిస్తో బాసీ రోటీ స్టౌ దగ్గర వదిలేసింది.


అమ్మ ఉంటే . . . అనుకుంది ఒక్కసారి.

ఫ్రూట్ కేక్ ఫ్రిజ్ లోంచి తీసి బాక్స్‌లో సర్ది బ్యాగ్‌లో పెట్టుకుంది.

ఇక రెడీ అవాలి!

బ్లూ బ్లాక్ జీన్స్. . ఇది లాస్ట్ టైమ్ ఎప్పుడు వాష్ చేయడ మైంది. హు, జ్ఞాపకం లేదు. అయినా ఇప్పుడు . . .

స్టాక్ క్లియరెన్స్ ఆఫర్‌లో నిన్న కొన్న రోజ్ కలర్ చుడీ దార్.



లుక్స్ గుడ్!

ఇప్పుడు అద్దాన్ని ఏమీ అడిగే ఓపిక లేదు.

తన ముఖాన్ని చూసుకునే టైమ్ లేదు.

మెకానికల్‌గా మేకప్ అయి, ఇంటికి పేకప్ చెప్పి. . .

ఆమె బయటికి రాబోతుంటే పని మనిషి . .

కీస్ దాని చేతిలో పడ్డాయి.

రోజులో డ్రడ్జరీ భాగం అయిపోయింది.

అందరూ కొత్త సినిమాకి వెళ్తున్నారు.

లగే రహో మున్నా భాయ్!

ఏదేనా ఇంటరెస్టింగ్ సీన్. . ?

వాడ్డూయూ మీన్ . . ఇంటరెస్టింగ్ కా మతలబ్?

అరె యార్. నయా ఫిల్మ్, నయాకా మతలబ్ ఇంటరెస్టింగ్ హైనా?

రంజన్ కనిపించేడు థియేటర్ దగ్గర సిటీ సెంటర్‌లో . . .

టికెట్ వాడే, డ్రింక్ వాడే, పాప్ కార్న్ వాడే ...

చాలనట్లు ఫిల్మ్ అయిపోయాక హండ్రెడ్ అండ్ సిక్స్‌టీ రుపీస్ లార్జ్ అయిస్ క్రీమ్ వాడే . . .

ఆమె పర్సు, బరువు లేదు. . కానీ అందులో ఐదు థౌజండ్స్!

ఈవెన్ దెన్ ఎంజాయ్ మెంట్ . . జో కుఛ్ యార్ దేతాహై, ఓ తో ఎంజాయ్‌మెంట్ హీ హోతాహై!! బాయ్‌ఫ్రెండ్ ఎందుకున్నాడు, ఖర్చు భరించడానికేగా.

'డిడ్ యూ ఎంజాయ్ ద ఫిల్మ్ రంజన్?'' అయిస్ క్రీమ్‌డ్ లిప్స్ స్మాక్ చేస్తూ...

''టు టెల్ యూ ద ట్రూత్ త్రూ అవుట్ ద ఫిల్మ్ ఐ హేవ్ బీన్ లుకింగ్ అట్ యూ యార్. యూ లుక్ టెరిబుల్ ఇన్ దిస్ న్యూ డ్రెస్ . యాక్చువలీ ఐ యామ్ నాట్ సో ఇంటరెస్టెడ్ ఇన్ . . ఫిల్మ్ ఏ యూనో . . . ''

''ఈజిట్ ?'' ఆమె చేతిలో అయిస్ క్రీమ్ పూర్తయింది.

''రంజన్, నీ పేరేమిటో నాకు నచ్చలేదు, పాత పేరది'' కర్చీఫ్‌తో లిప్స్ అద్దుకుంది.

''యార్, స్నేహల్ . . . నైనో క్లాక్ షో కేనా?''

''బై రంజన్, స్నేహల్ నేనూ వస్తాను, నైనో క్లాక్ షో . . ఏ సినిమా?''

''మంగళ్ పాండే.''

''కమాన్.''

రంజన్ . . తెల్లబోయాడు . వెనకనించి జీన్స్‌లో లయగా కదులుతున్న వీణ పృష్ఠ భాగాన్ని చూస్తుండి పోయాడు.

ఇదెప్పటి విషయం? అయిదారేళ్ల కింద . . అప్పుడు తను బబ్లింగ్ విత్ ఎన్‌తూసియాజమ్. ఉత్సాహంతో ఉరుకుతుండేది. శరీరం అణువణువులో అందం వెల్లి విరుస్తుండేది.


వర్క్ ప్లేస్‌లో చాలా అలిసిపోయింది.

ఇంటికి వెళ్తే . . అమ్మ లేదు, అమ్మని తనే . . .

ఏదేనా ఫిల్మ్, ఎనీ రిఫ్రెష్‌మెంట్?

సిటీ సెంటర్ మెట్లెక్కుతుంటే నీరసం తోసుకొచ్చింది.

అమ్మ దగ్గర వుంటే, పర్టిక్యులర్‌గా ఈ కండిషన్లో . . .



ముందు ''హ్యాంగ్ అవుట్''లో పడ్డాది వీణ.

కపుల్స్, కపుల్స్ . . ఎక్కడ చూసినా వాళ్లే.

యవ్వనంతో తుళ్లుతున్న జంటలు.

నవ్వుతున్నారు, కారణం లేకుండానే.

ఒకర్నొకరు తాకుతున్నారు. అవసరం లేకుండానే. .

మాటల ప్రవాహాలు , అర్థం లేకుండానే.

స్వీట్ నథింగ్స్ . . ఎవ్విరీ థింగ్ ఈజ్ స్వీట్ యార్.

ఎక్కడో ఒక్క . . . వయసు అయిపోయిన ఒక జంట. .

చూపు వారిపై ఒకసారి ప్రసరించి . . అయినా వారూ జంట కదా, తనే ఒంటరి . . .?

ఓ సారి అక్కడున్న జంటల్ని సర్వే చేసింది.

చిన్న చిన్న వాళ్లు – ఇంకా చదువుకుండేలాగున్నారు , మెడ వెనకాల రికార్డ్స్ , బుక్స్‌తో బరువుగా వేలాడుతున్నయ్ బ్యాగ్స్.

యార్ పక్క నుండగా లోకమంతా అమృతమయమనుకుని నవ్వులు పూయిస్తూ . . . నవ్వులే నవ్వులు , మాటలే మాటలు . .

మాట్లాడుతూనే ప్లేట్లలో టిఫిన్ తెచ్చిపెట్టుకుంటున్నారు.

ఒక అబ్బాయి ప్లేట్లో బెంగాలీ సమోసా, మట్టి కప్పుల్లో టీ తెచ్చి స్వీట్ హార్ట్‌కి సర్వ్ చేస్తున్నాడు. అతని జోడీ అమ్మాయి తన పెదవుల్తో అతని ఊహల్ని కిస్ చేస్తోంది.

ఇంకో అమ్మాయి కాపర్ బాటమ్డ్ పాట్‌తో ఫ్రయిడ్ రైస్, రైతా, దాల్ తెచ్చి టేబిల్ మీద ఉంచుతుంటే అబ్బాయి తన ముఖంపై పడిన ఆ అమ్మాయి చున్నీలో తన ముద్దులుంచి ఆమె వైపు కన్ను గీటుతున్నాడు.

తనకే జంట లేదా . . తనొక్కతే . . .

ఆమె మనసు నీరెక్కింది.

ప్లేట్ ఇడ్లీ విత్ సాంబారు తీసుకు , భోజనం... స్పూన్‌తో ఇడ్లీ తుంచి సాంబార్‌తో తింటోంది.

సాంబార్ ఎట్లాగో వుంది, బెంగాలీ సాంబార్? ఇడ్లీ స్పాంజ్‌లా వుంది, బాగా వైట్‌గా మెరుస్తూ, సోడాతో కదా!

ఇక్కడే వుంటుంది తను, ఈ బెంగాలీ ఇడ్లీ తింటూ, ఈ వంగ సాంబారు తాగుతూ, అమ్మ చేసే ఇడ్లీ సాంబార్ ఎలా వుంటుంది. . తెల్లటి మెత్తటి ఇడ్లీ, ముక్కుతోనే సగం తినేసేయొచ్చుఆ సాంబారు!!

కాఫీ తెచ్చుకు తాగుతోంది.

కాఫీ బాగుందిలే. ఇన్‌స్టెంట్ కదా. ఎక్కడేనా బాగుంటుంది . . ముఖర్జీ చేసినా, బెనర్జీ కాచినా.

కొంచెం తాగేక . . ఎంజాయ్‌మెంట్ తగ్గింది.

నిన్న ఒచ్చినట్టు మళ్లీ పెయిన్ ఒస్తుందా , బాప్ రే. మర్ జాయెగీ! ఆ పెయిన్ . . ఆ ఎక్స్‌క్రూషియేటింగ్ పెయిన్ . . ఎట్లా భరించడం?

అమ్మ చేత్తో రాస్తే తగ్గుతుందేమో . . . తనేగా అమ్మను దూరం చేసుకుంది.

మర్ జాయెగీ . . అనుకుంటే నవ్వొస్తుంది. చనిపోడానికే కదా ఇదంతా?

తన బాధ ఎవరికి చెప్పుకోవడం, అనింద్యకా . . ఛీ వాడు తనకి ఏం కాడు.

అమ్మకి కష్టం చెప్పుకుంటే . . బాధ్యత లేని వెధవతో ఎంత బాధ్యతారహితంగా తిరిగేవంటుందా, తనను అసహ్యించుకుంటుందా?

టైమెంతయింది, పది దాటింది.

సిటీ సెంటర్ మెట్లు దిగుతూ అనింద్యకి ఫోన్ చేసింది.

''హాయ్ స్వీటీ హౌ ఆర్యూ'' అనింద్య వాయిస్ జాలీగా వుంది.

ఆమె కూడా ''హాయ్!'' అంది హస్కీగా.

''దటీజ్ మై స్వీటీ. నీ హస్కీ వాయిస్‌తో నాలో పేంగ్స్ ఆఫ్ పేషన్ లేపుతావ్ నువ్వు. దొంగా'' అనింద్య మిస్చివస్ మాటలు ఆమెను గట్టిగా వాటేసుకున్నాయి.

క్షణం గొంతులో తడిని దిగమింగింది. ఇక ఇప్పుడు చెప్పడం అవసరమా,

కోల్డ్‌బీర్‌లో అయిస్ తేలుతుంటే బాగుంటుంది. ఆ స్వీట్ నథింగ్స్ సాగనీ.

ఈ సాబ్ స్టోరీస్ ఎందుకు?

అనింద్యతో తన అనారోగ్యం గురించి ఏమీ చెప్పలేదు.

అపార్ట్‌మెంట్‌కి వచ్చి డ్రెస్ ఛేంజ్ చేసుకుని . . . అద్దంలోకి . .

ఊహుఁ . వద్దు. తెల్లారి చూసిన ముఖం మళ్లీ కనిపిస్తే . .? ఎంత భయంకరం!

అద్దంలో అమ్మ ముఖం కనిపిస్తే . . .

అద్దానికి ఎదురుగా ఎప్పుడో తను ఉంచిన అమ్మ ఫోటో . . .

బెడ్ మీద వాలింది.

పల్చటి మ్యాక్సీ లోంచి వంటి మీద కర్చ్ఫ్ తడుముకుంటుంటే పొట్ట దగ్గిర ఎత్తు . .

ఇందాక 'హ్యాంగ్ అవుట్'లో ఇడ్లీ సాంబారు, కాఫీ బిల్లు పే చేస్తుంటే డబ్బులు కింద పడ్డాయి. తియ్యడానికి వంగుతుంటే బేరర్ ''మేడమ్, లెట్ మీ డూ ఇట్ ఫర్ యూ'' అంటూ వాటిని తనే తియ్యడం గుర్తొచ్చింది.

అంటే విజిబుల్‌గా తనపొట్ట . . .

తనకి జంట లేరు, కానీ పొట్ట . . . ? పొట్టే తన జంట!

ఆమె వ్యాఖ్యానం ఆమెకే నవ్వు తెప్పించింది.

పొట్టలో ఉన్నది పాపా, బాబా ? ఎవరి బిడ్డ, బేబీకి తండ్రి ఎవరు?

తనకి తెలుసు, తండ్రి ఎవరో–అయితే ఎవరికి చెప్పుకోగలదు?

పెద్దగా నిట్టూర్చింది. కనీసం అమ్మకైనా తెలీనివ్వలేదు. అమ్మకి చెప్పాలి కదా! తను అమ్మ అవుతోందని – గిల్టీ ఫీలింగ్. అమ్మ హర్షించదు కదా, ఈ భయంకరమైన తప్పును . . !

అనింద్య తన బిడ్డను స్వీకరించడానికి రెడీగా ఏం లేడు.

స్నేహం చెయ్యడం, ప్రేమించే ననడం, వాళ్లతో ఇంటిమేట్‌గా ఉండి మోజు తీరేక వాళ్లని మరిచిపోవడం అనింద్య హాబీ!

అనింద్య ఈ హాబీ గురించి వీణ ఫ్రెండ్స్ సర్కిల్ అంతా చెప్పేరు. అంతా విని కూడా, అన్నీ తెలిసీ కూడా . . .

ఒక్క లీనాయే అనింద్యని వదలకుండా పట్టుకుని, తన పాపకి తండ్రిగా కోర్టులో రుజువు పరిచి అతన్ని పెళ్లి చేసుకుంది.

లీనా ఎలాగైతేనేం సాధించిందనుకున్నారంతా.


కానీ ఉన్నట్టుండి కొత్త జాబ్ చూసుకుని అనింద్య లండన్ వెళ్లిపోయేడు.

ఈ వ్యవహారం పాత బడ్డాక . . . ఒకరోజు వీణ ఆఫీస్ నుంచి వచ్చే సరికి అపార్ట్‌మెంట్ బాల్కనీలో నుంచుని ఉన్నాడు అనింద్య.

వీణ ముఖం ముడుచుకుంది.

తాళం తీసేసరికి వీణతో బాటు అనింద్య కూడా లోపలికి వచ్చేడు.

''మధ్యాహ్నం ఫ్లయిట్‌లో వచ్చేను'' అన్నాడు.



''సోవాట్?'' అనలేదు కాని అదే అర్థంతో కళ్లెత్తి చూసింది.

''పాత పరిచయస్తులెవరా అనుకుంటుంటే నువ్వు జ్ఞాపకం వచ్చావు.'' కళ్లు వాల్చేసింది.

''సరి. ఇక్కడ సెటిలై పోతాను.'' అన్నాడు సోఫాలో వాలుతూ.

''లీనా దగ్గర కెళ్ళు'' కసిరింది వీణ.

''నా కిష్టం లేదే'' అని కొంచెం ఆగి ''నే నంటే భయమా'' కొంటెగా నవ్వేడు.

అలా అనింద్య ఇంటికి రావటం మొదలు పెట్టాడు.

ఎలా జరిగిందో తనకే తెలీదు, వీణ అతన్ని లైక్ చెయ్యటం మొదలెట్టింది.

వీణ గుండెల్లో అతను మఠం వేసుకు కూచున్నాడు.

''మళ్లీ నేను లండన్ వెళ్లిపోతాను'' అన్నాడో రోజు.

''లీనాను వదిలేసా?''

''నేను వదిల్నా లీనా నా వెంట పడుతుందిలే. నీ జ్ఞాపకమే నాకేం లేదు'' అన్నాడు వీణ వళ్లంతా కళ్లతో తడుముతూ.

ఆ చూపులు వీణకి ఎక్కడో గుచ్చుకున్నాయి.

అనింద్యలాటి వారి చూపులూ, మాటలకి వీణ లాటి ఆడపిల్లలు బలి అవుతూనే వుంటారు.

బయట పెద్దవాన. వీణ కట్టుకున్న సిల్క్ శారీ జారిపోతోంది.

అనింద్య దగ్గరగా వచ్చి మీద చెయ్యి వేసినా వీణ అభ్యంతరం చెప్పలేదు.

వీణ అనింద్యతో ఉండటం మొదలుపెట్టింది.

తన స్వేచ్ఛా జీవితానికి అమ్మ అడ్డమని అమ్మని మామయ్య దగ్గరికి . . . వీణ ఫ్రెండ్స్ చాలా మంది దూరమయ్యారు.

అమ్మతో ఫోన్‌లో కూడా మాట్లాడటం మానేసింది గిల్టీ ఫీలింగ్‌తో.

వీణ ప్రెగ్నెంట్ అయింది. ఇక తల్లితో ఏమని మాట్లాడుతుంది?

పెళ్ళి కాకుండా తల్లి అవడం అమ్మ హర్షిస్తుందా?

''అబార్షన్ చేయించుకుని ఫ్రీగా ఉండు, సెంటిమెంట్స్ పెట్టుకోకు'' అనింద్య చిరాగ్గా అన్నాడు.

''నాకు బిడ్డ కావాలి'' అంది వీణ.

''టు హెల్ విత్ యువర్ సెంటిమెంట్ అండ్ మదర్ హుడ్. నన్ను ఇందులో ఇరికించకు.''

''డోంట్ బి ఎఫ్రైడ్ అనింద్యా. నువ్వు నన్ను ఫోర్స్ చెయ్యలేదు, రేప్ చెయ్యలేదు. నాకు నేనుగా నీతో సెక్స్ లైఫ్ గడిపాను. దాని రిజల్ట్ . . నేను బిడ్డని పెంచగలను.''

పిల్లల్ని పెంచడానికి మగవాడి ఆసరా ఉండి తీరాలా, నాన్‌సెన్స్! అనుకుంది వీణ.

నెల మీద నెల గడుస్తుంటే అపార్ట్‌మెంట్‌లో మిగతావారి ప్రశ్నలు ఎక్కువయ్యాయి.

వీణకి ఏం చెప్పడమో తెలియలేదు. కోల్‌కతాలో కూడా ఇట్లా . . . .

**'సహానుభూతి' కథ**



నవ్య వారపత్రిక నిర్వహించిన 2010 దీపావళి కథల పోటీలో నా **'అద్దంలో ముఖాలు'** కథకు విశేష బహుమతిని ఇచ్చినందుకు చాలా సంతోషం. ఆధునిక నాగరికతలో ఎటువైపు వెళ్తున్నారో తెలియక అర్థంకారి రీతిలో జీవితాలను అభాసుపాలు చేసుకుంటున్న విద్యావంతులైన నేటి యువతుల పట్ల సహానుభూతి చూపిస్తూ వ్రాసినకథ ఇది. దీనిని ఆదరిస్తే ఈ దిశలో నేను చేసిన ప్రయత్నం సఫలమైనట్లే!

**- జంధ్యాల మాలతి**

**సెల్ : 08017164690**

ఇప్పుడే ఇలా వుంటే రేపు బిడ్డని స్కూల్లో జాయిన్ చెయ్యడం!

ఇంత పెద్ద విషయాన్ని తను ఎంత సింపుల్‌గా తీసుకుంది!

వీణ కృంగి పోతోంది. కృశించి పోతోంది.

రాత్రిళ్లు నిద్రపట్టక ఊరికే బెడ్ మీద 'టాస్' అవుతోంది.

అంతకన్నా పెద్దదెబ్బ . . . ఇరవై రోజుల క్రిందట సన్‌డే తను డాక్టర్ దగ్గరికి వెళ్లింది.

గైనకాలజిస్ట్ దగ్గర చెకప్ అవుతున్నప్పుడు చెప్పింది వీణ.

తనకు ప్రతి రోజూ జ్వరం వస్తోందని, కడుపులో ఓ పక్కగా ఉండుండి తీవ్రమైన నొప్పి వస్తోందని.

కొన్ని ప్రశ్నలు వేసాక గైనకాలజిస్టు మెడిసిన్ స్పెషలిస్ట్ దగ్గరికి డైరెక్టు చేసింది.

అలా అలా మెడికల్ చెకప్స్ అన్నీ అయ్యాక తేలింది వీణకి క్యాన్సర్ అని.

అప్పటి దాకా మొండి ధైర్యంతో ఉంది వీణ. చైల్డ్ పుడితే ధైర్యంతో తనే పెంచగలదని.

మరి ఇప్పుడు . . ఇప్పుడేం చెయ్యగలదు? చైల్డ్‌ని చూసుకోవాలి, తన క్యాన్సర్ జబ్బుతో పోరాడాలి, ఉద్యోగం కూడా చెయ్యాలి.

మొట్టమొదటిసారి 'తనవారి' అవసరం తెలిసి వచ్చింది.

మొట్ట మొదటిసారి పెళ్లి ప్రాముఖ్యం, పెద్దల మాట వినడం చేయాలనిపించింది.

తను ఇష్టం వచ్చినట్టు బిహేవ్ చేసింది, పెళ్లి కాకుండా.

తన ధైర్యానికి తనే హేట్సాఫ్ అనుకుంది.

ఇప్పుడేమిటి చెయ్యగలదు?

వేదనతో ఆమె శిరస్సు పగిలిపోతోంది.

తన ఈ క్యాన్సర్ గొడవతో రేపు పొద్దున్న చైల్డ్ పుడితే ఆ పాపని ఎట్లా చూడగలదు.

అందుకే . . . అందుకే నిశ్చయించుకుంది , తను చనిపోవాలని . .

ఆర్లీ స్టేజిలోనే డిటెక్ట్ అయిన క్యాన్సర్ . . క్యూర్ అయిపోతుందని డాక్టర్లు చెప్పేరు. మదర్ కూడా కాబోతోందని తెలిసి ఆమె కండిషన్ చూసి వాళ్లు మరింత శ్రద్ధగా ఆమెకు ట్రీట్‌మెంట్ ఇస్తున్నారు.

క్యాన్సర్ పేషంట్‌కి పిల్లలేమిటి?

తను అంతమవటమే తనకు ముక్తిమార్గం.

కానీ ఇన్నాళ్ల నుండి కడుపులోని బిడ్డపై పెంచుకున్న మమకారం . .

బాబుని ఏం చెయ్యగలదు? అన్యాయంగా కడుపులోనే మట్టుబెడుతుందా?

ఆమె కళ్ళ నుండి ధారగా నీళ్లు కారుతున్నాయి.

కళ్ల మసకలలో తను ఎంతో ముచ్చటపడే ఏనుగు బొమ్మ . . . చిన్న ఏనుగు, దాని పొట్టలో బుల్లి ఏనుగు . . .

కళ్లు తుడుచుకుని అద్దం ముందు నిలుచుంది.

ఇప్పుడు మళ్లీ తెల్లవారు ఝామున చూసిన భయంకరమైన వీణ ముఖం కనిపించింది.

గుర్తు పట్టడానికి వీల్లేని ముఖం! ముఖంలో ఎన్నో గీతలు!

''ఇన్ గ్లోరియస్ బాస్టర్డ్స్'' సినిమాలో స్వస్తిక్ మార్క్ చెక్కిన బందీ ముఖంలా . . .

తనే మదర్‌హుడ్ అని ముచ్చట పడింది.

ఇప్పుడు చేతకాదనుకుని బిడ్డని హత్య చేయాలనుకుంటోంది.

తను హంతకురాలు! తన పాపాలు, తప్పులు తన ముఖంలో కనిపిస్తున్నాయి. తనని తను ఎంత గొప్పగా భావించుకుంది.

కాని తను నాట్ ఈవెన్ ఏన్ ఆర్డినరీ మదర్!

సామాన్యమైన ఏ స్త్రీ అయినా తల్లి అయినాక గొప్ప స్త్రీ అవుతుంది.

తను . . . గొప్ప స్త్రీ ఎలాగూ కాలేదు. సామాన్యమైన స్త్రీ కూడా కాదు.

స్టైల్‌గా జీవితం గడిపి డబ్బు మత్తులో సంఘాన్నీ అమ్మనూ కాదని . . . తనకు ఇప్పుడు తన కన్నీరు తుడిచే అమృత హస్తం కావాలి. తన కన్నా ముఖ్యం తన బిడ్డను అక్కున చేర్చుకునే ఒక పవిత్ర మాతృమూర్తి కావాలి . . .

భగవంతుడా నా బిడ్డను రక్షించుకోవడానికి నా తల్లి నాక్కావాలి . . . అమ్మా . . . వేదనతో దుఃఖిస్తూ పడుకున్న వీణ నిద్రలోకి జారింది.

తెల్లవారుతుండగా వీణకి తెలివొచ్చింది.

అద్దం ముందు నిలుచుంది.

అద్దంలో తన ముఖం ప్రశాంతంగా ఉంది. ముఖంలో గీతలు లేవు.

వీణ ముఖం ప్రశాంతంగా ఉంది. వీణ కొంచెం పక్కగా జరిగింది.

వీణ ముఖం పక్కనే వీణ తల్లి ముఖం ఉంది.

వీణకు తెలుసు, ఏ తల్లీ తన బిడ్డను వదలదని.

తనూ వదలదు. తనకి తన తల్లి సాయం, తన బిడ్డకి తను సాయం!

అద్దంలో కనబడుతున్న రెండు ముఖాలూ, పొట్టలోని పాప ముఖం . . . మూడు నవ్వుతున్నాయి ఆనందంగా!!

★